సాక్షి ఖమ్మం

ఆదివారం । 7 । మే । 2023



ఆకుపచ్చని జ్ఞాపకం!
కన్నీళ్లతో బంధువుల అంత్యక్రియలకు వచ్చే వారికి సాంత్వన చేకూర్చేలా అల్లీపురంలో శ్మశానవాటికను తీర్చిదిద్దారు.
8లో



... ఆంధ్రా వెళ్లాల్సిందే.
భద్రాద్రి జిల్లాలో వర్జీనియా పొగాకు సాగు చేస్తున్న రైతులు ఇక్కడ వేలం కేంద్రాలు లేక జంగారెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తోంది.
10లో

గరిష్ఠం / కనిష్ఠం
34°/ 25°

వాతావరణం
ఆదివారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఎండ ప్రభావం కనిపించదు.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించాక నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి



గోపికా నాగశ్రావ్య

ఖమ్మంలీగల్: ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పెనుమల గోపికా నాగశ్రావ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు కేసులను విచారించారు. విజయవాడ సిద్ధార్థ లా కళాశాలలో న్యాయ విద్య అభ్యసించిన ఆమె 2015లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాది నవకుమార్ వద్ద ప్రాక్టీసు చేస్తూ 2020లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. హన్మకొండలో మొదటి పోస్టింగ్ పొందిన ఆమె సాధారణ బదిలీల్లో ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా వచ్చారు. నాగశ్రావ్య తండ్రి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. పెండింగ్ సివిల్ దావాలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈసందర్భంగా నాగశ్రావ్యకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాక్సినేషన్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న రమణ

చింతకాని: మండలంలోని చింతకాని, వందనం, లచ్చగూడెం గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను శనివారం జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ చింతల రమణ పరిశీలించారు. గర్భినులు, చిన్నారులు క్రమం తప్పకుండా టీకా వేయించుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉద్యోగులు సతీష్, సుధాకర్, వెంకటనారాయణ, జయమ్మ పాల్గొన్నారు.

విస్తృతంగా ఆరోగ్యశ్రీ సేవలు



ఆస్పత్రి వద్ద ఆరోగ్యశ్రీ అధికారులు

మధిర: ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ విస్తృతం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గోపి, జిల్లా మేనేజర్ శ్రీనివాస్ సూచించారు. మధిర ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం సందర్శించిన వారు రోజువారీగా ఆరోగ్యశ్రీపై కేసులపై ఆరా తీశారు. అలాగే, పేషంట్ ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ వైద్యులు అనిల్‌కుమార్, ఆరోగ్యశ్రీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఖమ్మంఅర్బన్: జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎస్‌బీఐ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్ తెలిపారు. జ్యూట్ బ్యాగుల తయారీపై ఈనెల 10నుంచి, సీసీ కెమెరాల నిర్వహణపై 15నుంచి ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డు సమీపంలోని తరుణి హట్‌లో శిక్షణ మొదలవుతుందన్నారు. పదో తరగతి పూర్తిచేసి, 18 నుంచి 45 ఏళ్ల వయస్సు వారు అర్హులని, శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పదో తరగతి మెమో, రేషన్, ఆధార్ కార్డులు, నాలుగు ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 63014 38045, 98850 62799, 81253 94333 నంబర్లలో సంప్రదించాలని జీఎం సూచించారు.

పైలట్ హైలెట్!

- 'దళితబంధు' పైలట్ మండలాల్లో చింతకాని టాప్
- కలెక్టర్ చొరవతో రాష్ట్రంలోనే అత్యధిక యూనిట్ల గ్రౌండింగ్
- జిల్లాల స్థాయిలోనూ సంతృప్తికరంగా యూనిట్ల పంపిణీ
- పథకంతో మారిన దళితుల ఆర్థిక జీవన స్థితిగతులు



శారీ రోలింగ్, ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వహిస్తున్న దూమాల మధుసూదన్, అనూష

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో దళితబంధు పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేయగా.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం యూనిట్ల గ్రౌండింగ్‌లో రాష్ట్రంలోనే హైలెట్‌గా నిలిచింది. ఈ మండలంలోని 3,461 మంది లబ్ధిదారులకు రూ.346 కోట్ల విలువైన యూనిట్లు అందాయి. తద్వారా దళితులు ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా బతుకు బాటలు వేసుకున్నారు. అలాగే నియోజకవర్గాల వారీగా కూడా ఖమ్మం జిల్లాలోని లబ్ధిదారులకు 484 యూనిట్లు అందాయి. పైలెట్ ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానంలో, నియోజకవర్గాల వారీగా చూస్తే ఏడో స్థానంలో ఖమ్మం నిలిచింది.

పైలట్ ప్రాజెక్టుల్లో ఒకటి.
2021 ఆగస్టు 16న ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో దళితబంధు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిని సీఎం దత్తత తీసుకుని అమలు చేశారు. అనంతరం రాష్ట్రంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం, సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారగొండ, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలాలను పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు.

రాష్ట్రంలోనే ప్రథమస్థానం
పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో చింతకానిలో అత్యధికంగా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఈ మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో 25 జీపీల్లో దళితులు ఉన్నారు. మండలంలో 3,461 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరగా 65రకాల యూనిట్లు నెలకొల్పుకున్నారు. ఆ తర్వాత స్థానాల్లో తిరుమలగిరి, చారగొండ, నిజాంసాగర్ మండలాలు నిలిచాయి. ఇక నియోజకవర్గాల వారీగా యూనిట్ల పంపిణీని పరిశీలిస్తే హైదరాబాద్ 1,484 యూనిట్ల గ్రౌండింగ్‌తో ప్రథమస్థానంలో నిలవగా, ఖమ్మం జిల్లాకు 484యూనిట్లతో ఏడో స్థానం దక్కింది.

కలెక్టర్ చొరవతో..
అనేక మంది దళితుల జీవితాల్లో దళితబంధు పథకం వెలుగులు నింపిందనే చెప్పాలి. కూలీ పనులకు వెళ్తేనే పూట గడిచే దుర్భరమైన జీవితం గడుపుతున్న పలువురు ఇప్పుడు ఉపాధి పొందడమే కాక మరికొందరికి పని కల్పిస్తున్నారు. చింతకాని మండలంలో అందరికీ లబ్ధి చేకూరేలా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్వయంగా లబ్ధిదారులతో మాట్లాడి ఏ యూనిట్ అయితే బాగుంటుందో అవగాహన కల్పించారు. అలాగే, యూనిట్లు పక్కదారి పట్టకుండా ప్రతీ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు అధికారులను సమన్వయం చేయడంతో రాష్ట్రంలోనే చింతకాని మండలం టాప్‌గా నిలిచింది.

కష్టాలు తీరి ఓనర్లయ్యారు..

చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన దూమాల మధుసూదన్ ఎమ్మెస్సీ బీఈడీ, ఆయన భార్య అనూష బీఎస్సీ, బీఈడీ చేశారు. గతంలో ప్రైవేట్ స్కూల్‌లో చాలీచాలని వేతనంతో పనిచేసేవారు. కరోనా సమయాన కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఇంతలోనే దళితబంధు మంజూరు కావడంతో శారీ రోలింగ్, ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్‌ను ఖమ్మంలోని బోనకల్ రోడ్డులో ఏర్పాటు చేశారు. ఇల్లు, షాపు అద్దె రూ.14 వేలు పోగా.. నెలకు రూ.50 వేలు చేతికి వస్తున్నాయి. అంతేకాకుండా మరొకరికి రూ.6 వేలు వేతనంతో ఉపాధి కల్పిస్తున్న మధుసూదన్–అనూష దంపతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలాల్లో యూనిట్ల పంపిణీ..

మండలం	జిల్లా	పంపిణీ అయిన యూనిట్లు
చింతకాని	ఖమ్మం	3,461
తిరుమలగిరి	సూర్యాపేట	2,223
నాగర్‌కర్నూల్	చారగొండ	1,407
నిజాంసాగర్	కామారెడ్డి	1,298

ఉపాధి వెతుక్కుంటూ వచ్చింది..



గన్నీబ్యాగుల దుకాణం నడుపుతున్న పట్టేటి గోపయ్య

చింతకాని మండలం నర్సింహాపురానికి చెందిన పట్టేటి గోపయ్య బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లో వాచ్‌మన్‌గా పనిచేశాడు. కుటుంబ పోషణ భారం కావడంతోపాటు వ్యవసాయానికి కూడా అప్పులు చేశాడు. దళితబంధు ద్వారా అందిన సాయంతో చింతకానిలో గోనెసంచుల దుకాణం పెట్టాడు. పత్తి, మిర్చి, ధాన్యం గోనెసంచులతోపాటు టార్పాలిన్లు కూడా విక్రయిస్తున్న ఆయకు ఖర్చులు పోగా నెలకు రూ.30వేలు మిగులుతుండటంతో ఉపాధి దళితబంధు రూపంలో వచ్చిందంటూ ఉద్వేగానికి గురయ్యాడు. అప్పులు కూడా తీరాయని ఆనందం వ్యక్తం చేశాడు.

అందరి కృషితోనే సక్సెస్..



పైలెట్ ప్రాజెక్టుగా దళితబంధు చింతకానిలో అందరి కృషితో సక్సెస్ అయింది. లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఏ యూనిట్‌తో లబ్ధి జరుగుతుందో ఆలోచించి గ్రౌండింగ్ చేయించా. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారుల సహకారంతో విజయవంతమైంది. దళిత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సక్సెస్‌ఫుల్‌గా అమలు చేయడం నా కెరీర్‌లో సంతృప్తినిచ్చే అంశం.

– వీ.పీ.గౌతమ్, కలెక్టర్, ఖమ్మం

సాఫీగా ధాన్యం సేకరణ



ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అజయ్‌కుమార్

- రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి
- నిల్వకు జింకల తండా గోడౌన్ వినియోగించుకోండి
- అధికారులతో సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో వరి ధాన్యం సేకరణ, రవాణా చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ధాన్యం సేకరణ, రవాణాలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ధాన్యాన్ని తీసుకొస్తే కొనుగోళ్లలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లావ్యాప్తంగా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా ఇప్పటివరకు కేవలం 30వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించడం సరికాదన్నారు. అయితే, కొన్నిచోట్ల వర్షాలతో ఇబ్బంది ఎదురవుతోందని అధికారులు వివరించారు. అలాగే, ఎఫ్‌సీఐ గోదాంల్లో నిల్వ సామర్థ్యం లేక సమస్య వస్తుందని లారీ యజమానుల సంఘం ప్రతినిదులు తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా రఘునాథపాలెం మండలం జింకల తండా వద్దఉన్న 20వేల మెట్రిక్ టన్నుల గోడౌన్‌ను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఈమేరకు ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్‌తో ఫోన్ లో మాట్లాడి అనుమతి ఇవ్వాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం..
అకాల వర్షాలతో ధాన్యం తడిసిన నేపథ్యాన రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మొత్తం ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని మంత్రి పువ్వాడ స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని కాపాడుతూ రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జూలై మొదటి వారంలోగా ధాన్యం సేకరణ పూర్తి చేసేలా, ప్రక్రియలో భాగస్వామ్యమైన అందరితో వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసి సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా సహకార అధికారి విజయకుమారి, ఆర్‌టీఓ తోట కిషన్‌రావు, అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీ గణేష్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సోములు, ఏఎంటీ వి.నర్సింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్క్‌ఫెడ్ మేనేజర్ పి.సునీత, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు భద్రం, బోయపాటి వాసు, సత్యంబాబు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి..

- 'డబుల్' ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయండి
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంఅర్బన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో ఎప్పటికప్పుడు పురోగతి కనిపించాలని.. ఏదైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకొస్తూ కూలీల సంఖ్య పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్, 15వ డివిజన్ అల్లీపురంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అల్లీపురంలో ఎనిమిది బ్లాక్‌ల్లో 192 గృహాలకు గాను 168 గృహాల పనులు ప్లాస్టింగ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. బ్లాక్‌ల వారీగా పనులు పూర్తిచేస్తూ లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, వైఎస్సార్ నగర్‌లోనూ మిగులు పనులు పూర్తిచేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో శిరీష, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, డీఈలు చంద్రశేఖర్, టి.కృష్ణారెడ్డి, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

నిర్దిష్ట వ్యవధిలో లక్ష్యసాధన
ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ లక్ష్యాలను నిర్దిష్ట వ్యవధిలోగా చేరుకునేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి ఆమె వీసీ ద్వారా కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, సీఎంఆర్, ధాన్యం కొనుగోళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, 58, 59 జీఓలు తదితర అంశాలపై సమీక్షించారు. సీఎంఆర్ అధికంగా పెండింగ్ ఉన్న జిల్లాల్లో పది రోజుల్లో, మిగిలిన జిల్లాల్లో మూడు రోజుల్లోగా పూర్తిచేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో కంటివెలుగు శిబిరాల నిర్వహణ చురుగ్గా సాగుతోందని, ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా రిఫరల్ కేసులపై శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా ఆయన ఖమ్మం, రఘునాథపాలెం, కారేపల్లి, కొణిజర్ల, నేలకొండపల్లి మండలాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

'ఆన్‌లైన్'లో రామయ్య సేవలు..

- భక్తులకు అందుబాటులో ఆర్జిత సేవలు, లడ్డూ టికెట్లు
- మరో పది రోజుల్లో ప్రారంభించే అవకాశం



రామాలయం వ్యూ

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అధికారులు భక్తులకు మరో తీపి కబురు అందించారు. సుదూర ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆన్‌లైన్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నారు. ఇందుకు సంబంధించిన కంప్యూటీకరణ పనులను అధికారులు వేగవంతం చేశారు.

పారదర్శకత పెంచేలా..
ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో దర్శన టికెట్లు, వసతి గృహాల టికెట్లను రెండేళ్లుగా ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచుతున్నారు. ఇతర వేళల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండటంలేదు. దీనికితోడు లడ్డూల టికెట్లు, దర్శన, ఇతర ఆర్జిత సేవల టికెట్లు నేరుగా విక్రయిస్తుండడంతో అవకతవకలు జరుగుతున్నాయి. సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో ఆలయానికి ఆదాయం తగ్గిపోతోంది. ఈ క్రమంలో ఆదాయంతోపాటు సేవల్లో పారదర్శకత పెంచేందుకు, భక్తుల డిమాండ్ దృష్ట్యా ఈఓ రమాదేవి ఆన్‌లైన్ సేవలపై అధికారులతో కలిసి కసరత్తు చేశారు. వెబ్‌సైట్ రూపకల్పనతో పాటు కంప్యూటరైజ్డ్ పనులను పూర్తి చేశారు. సిబ్బందికి తొలివిడతగా శిక్షణ కూడా ఇస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండగా, ఆలయ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

భక్తులకు ఇక్కట్లు తప్పినట్లే..
భద్రాచలం వచ్చే సామాన్య భక్తులకు ప్రధానంగా వసతి సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రత్యేక సెలవుదినాలతో పాటుగా శని, ఆదివారాల్లో రామాలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో దేవస్థానం కాటేజీలు, వసతి గృహాలతో పాటుగా ప్రైవేట్ లాడ్జీలలో సైతం గదులు దొరకని పరిస్థితి ఎదురవుతుంది. ప్రైవేట్ లాడ్జీల్లో గదులు ఉన్నా వేలాది రూపాయలను అద్దె చెల్లించాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో దేవస్థానం పరిధిలో ఉన్న కాటేజీలు, వసతి గృహాల వివరాలు ఆన్‌లైన్ అందుబాటులోకి వస్తే భక్తుల ఇక్కట్లు తొలగిపోయే అవకాశముంది.

అద్భుతాలని చెప్పి అప్పుల పాలు చేశారు..

- వర్షాలతో నష్టపోయిన రైతులకు సాయమేదీ?
- రైతుభరోసా ర్యాలీలో మాజీ ఎంపీ పొంగులేటి



రైతులతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అద్భుతాలు సృష్టిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో శనివారం రైతు భరోసా ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో రైతులు, నాయకులతో కలిసి ఖమ్మంలోని క్యాంపు కార్యాలయం నుండి పొంగులేటి ట్రాక్టర్ నడుపుతూ ఎస్ఆర్ గార్డెన్ వరకు వచ్చారు. అక్కడి నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని ఐదుగురిని అనుమతించారు. దీంతో పొంగులేటి వెళ్లి కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

తక్షణ సాయమంటే ఇదేనా?
యాభై రోజుల క్రితం అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను పరామర్శించిన సీఎం కేసీఆర్ తక్షణ సాయంగా ఎకరాకు రూ.10వేల చొప్పున ప్రకటించారని పొంగులేటి తెలిపారు. కానీ ఆ సాయం ఇప్పటికీ అందలేదని, కేసీఆర్ దృష్టిలో తక్షణ సాయమంటే ఎన్ని రోజులకో చెప్పాలని సూచించారు. ఎకరాకు రూ.10వేలు కాకుండా రూ.30 వేల చొప్పున అందించడంతో పాటు అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, మిల్లర్లు తరుగు, తేమతో నిరాకరించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం ఇస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హామీల అమలు ఊసేలేదు..
2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు రూ.లక్ష రుణ మాఫీ చేస్తామని ప్రకటించిన బీఆర్ఎస్.. ఇప్పటి వరకు రూ.25 వేలు మాత్రమే మాఫీ చేసిందని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. దీంతో రైతులపై వడ్డీ భారం పడుతోందని పేర్కొన్నారు. ఇక రైతుబంధు ఇస్తున్నామంటూ సబ్సిడీపై యంత్రాలు, ఎరువుల పంపిణీని నిలిపివేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తో పాటు నాయకులు మద్దినేని బేబీస్వర్ణకుమారి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, విజయబాయి, డాక్టర్ కోటా రాంబాబు, జారె ఆదినారాయణ, ఊకంటి గోపాలరావు, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దొడ్డా నగేష్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు స్థానం



శ్రీను, ప్రసాదరావును సన్మానిస్తున్న టీఎన్జీవోస్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కేంద్ర సంఘం నూతన కమిటీలో జిల్లా ఉద్యోగులకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఖమ్మంకు చెందిన నందగిరి శ్రీను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జీఎస్.ప్రసాద్‌రావు కార్యదర్శిగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీష్ సహకారంతో జిల్లాకు కీలక పదవులు దక్కగా, తమపై బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, శ్రీను, ప్రసాద్‌ను అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సంఘం బాధ్యులు వీర నారాయణ, మజీద్, కిరణ్, నవీన్, వై.శ్రీనివాసరావు, జ్యోతి, స్వప్న, మల్లీశ్వరి అభినందించారు.

క్లుప్తంగా

నేడు ఎంపీ పార్థసారధిరెడ్డికి సన్మానం

ఖమ్మంఅర్బన్: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డిని ఆదివారం సన్మానించనున్నారు. ఖమ్మంలోని మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఈ సభ జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొనుగోళ్లలో అలసత్వం సరికాదు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు

తిరుమలాయపాలెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతుల విషయంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. హడావుడిగా కేంద్రాలను పరిశీలించి వదిలేయకుండా కొనుగోళ్లలో వేగం పెంచి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆతర్వాత శ్రీధర్‌రెడ్డి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, గుండా శ్రీనివాసరెడ్డి, అనంతు ఉపేందర్, నూకల రామోహ్మన్‌రెడ్డి, మేక సంతోష్‌రెడ్డి, బి.ప్రసాద్, జి.గోవర్ధన్ పాల్గొన్నారు.

రేపు రామాలయం భూములపై సమావేశం

భద్రాచలం: ఏపీలోని యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న శ్రీ సీతా రామ చంద్రస్వామి దేవస్థానం భూములపై సోమవారం యటపాకలో సమావేశం జరగనుంది. పురుషోత్తపట్నంలో ఉన్న రామాలయం భూముల్లో అక్కడి రైతులు అక్రమ నిర్మాణాలను చేపట్టడం, వాటిని దేవస్థానం అధికారులు అడ్డుకోవడం.. ఈ నేపథ్యంలో వాగ్వాదాలు చోటుచేసుకోవడం విదితమే. ఈ భూములు పూర్వకాలం నుంచి తమవేనని అక్కడి రైతులు వాదిస్తుండగా రామాలయం అధికారులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో దేవస్థానానికి చెందిన భూములలో అక్రమ నిర్మాణాలను తొలగించి దేవస్థానం అధికారులకు అప్పగించాలని గతంలోనే హైకోర్టు పేర్కొంది. దీనికి గడువు సమీపిస్తుండటంతో ఆలయ ఈఓ రమాదేవి పాడేరు కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా యటపాకలో సోమవారం పాడేరు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పురుషోత్తపట్నం రైతులు, ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

భద్రాద్రి నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం నుంచి శ్రీశైలానికి ప్రతిరోజు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు భద్రాచలం డిపో మేనేజర్ బి.రామారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు భద్రాచలం నుంచి ఉదయం 3.45గంటలకు బయలుదేరే బస్సు పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, మిర్యాలగూడెం, నాగార్జున సాగర్, మాచర్ల మీదుగా సాయంత్రం 7 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 4 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కూడా కల్పించిన ఈ బస్సును సుశిక్షితులైన డ్రైవర్లతో నడిపిస్తున్నందున ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మిలీషియా సభ్యుడు, ముగ్గురు కొరియర్లు అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా సభ్యుడు హేమ్లా భీమాతో పాటు మావోయిస్టులకు కొరియర్లుగా వ్యవహరిస్తున్న పద్దం కళ్లు, మడకం దినేశ్, తాతి సోమాలను శనివారం చర్ల పోలీసులు అరెస్టు చేశారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో శనివారం ఎస్పీ వినీత్ వివరాలు వెల్లడించారు. చర్ల బస్‌స్టేషన్ సమీప ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో చర్ల పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలోనే మిలీషి యా సభ్యుడితోపాటు ముగ్గురు కొరియర్లు దొరికారని, వారి నుంచి 44 జెలెటిన్ స్టిక్స్, 16 మీటర్ల పొడవైన కార్డెక్స్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ తెలిపారు. పద్దం కళ్లు, హేమ్లా భీమా ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా చిన్న గెల్లూరు, పెద్ద గెల్లూరు పంచాయతీ.. తర్రెం పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు చర్ల లెనిన్‌కాలనీకి చెందిన వారని చెప్పారు. వీరంతా పేలుడు పదార్థాలను మావోయిస్టులకు ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారని ఎస్పీ వెల్లడించారు. ఇంకా సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్, చర్ల సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుపచ్చని జ్ఞాపకం !

మోడల్‌గా అల్లీపురం శ్మశానవాటిక

- రూ.1.66కోట్లతో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం
- పచ్చని చెట్లతో సాంత్వన చేకూర్చేలా ఏర్పాట్లు
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు



శ్మశానవాటిక ఆవరణలోని పచ్చదనం, శివుడి విగ్రహం

శ్మశానం వైపు వెళ్లడమంటేనే ఒక భయానకమైన అనుభవం. అరకొర సౌకర్యాలు, నిల్చోవడానికి కూడా నీడ లేని పరిస్థితులు. కుటుంబ సభ్యులో, బంధువులో కన్నుమూస్తే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు ఓ పక్క కంటి నిండా దుఃఖం, మరోపక్క దుర్భరమైన పరిస్థితులతో ఉండే శ్మశానవాటికలతో ఇబ్బంది పడేవారు. కానీ నగరంలోని 15వ డివిజన్‌లో అల్లీపురంలో నిర్మించిన శ్మశానవాటిక దుఃఖం మరిచిపోయి సాంత్వన చేకూర్చేలా సిద్ధమైంది. జిల్లా కేంద్రం ఎక్కడా లేనివిధంగా అన్ని వసతులతో ఈ శ్మశానవాటికను మోడల్‌గా తీర్చిదిద్దారు.

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్ అల్లీపురంలో మోడల్ శ్మశానవాటిక రూపుదిద్దుకుంది. గ్రామ సమీపాన సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిలో ఆధునాతన సౌకర్యాలతో సిద్ధమైంది. ప్రతీ గ్రామం, డివిజన్‌లో శ్మశాన వాటిక ఉండాలనే ప్రభుత్వం లక్ష్యంలో భాగంగా కార్పొరేషన్ నిధులు రూ.1.66కోట్లతో శ్మశాన వాటిక నిర్మించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవ, కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు పర్యవేక్షణలో మూడు నెలలు క్రితం శ్మశాన వాటిక నిర్మాణం పూర్తికాగా, మంత్రులు కేటీఆర్, పువ్వాడ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు.

గుట్టల మధ్యే అంత్యక్రియలు

అల్లీపురంలో ఎవరైనా కన్నుమూస్తే గుట్టల మధ్య లేక మృతుల వ్యవసాయ భూముల్లో అంత్యక్రియలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు శ్మశానవాటిక అన్ని వసతులతో సిద్ధమైంది. చుట్టూ ప్రహరీ, ప్రత్యేక ఆకర్షణగా ప్రత్యేక ద్వారం నిర్మించారు. అలాగే, వందలాది మొక్కలు, పచ్చనిగడ్డి నీటి బోరు నీటితో నిత్యం పచ్చగా కళకళలాడేలా సంరక్షిస్తున్నారు. ఇక ఒకేసారి రెండు మృతదేహాలను దహనం చేసేందుకు గద్దెలు, కుటుంబసభ్యులు, బంధువులు వీక్షించేలా స్టేజీ నిర్మించారు. అలాగే, విశ్రాంతి గదులు, కర్మకాండలు, కేశఖండన కోసం వేర్వేరు షెడ్లు.. శవపేటికల నిల్వ కోసం ఇంకో గది సిద్ధం చేశారు. అలాగే, శ్మశాన వాటికలో భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడమే కాక కాకులు బొమ్మలు సైతం ఏర్పాటు చేశారు. వీటికి తోడు కాటికాపరి బొమ్మకు ఏర్పాటైంది.



ఆవరణలో పక్షుల బొమ్మలు

కడియం మొక్కలతో చూడచక్కగా..

శ్మశాన వాటికలో మున్సిపల్ నర్సరీతో పాటు కడియం నుంచి తెప్పించి వెయ్యికి పైగా మొక్కలు నాటి వనంలా తీర్చిదిద్దారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లేశ్వరి ఆధ్వర్యాన మొక్కలు నాటించి సంరక్షణపై సూచనలు చేస్తున్నారు. శ్మశాన వాటిక ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఏటా సువాసనతో పూలు పూసే స్పైడర్ లిల్లీ మొక్కలు నాటడంతో బంధువుల అంత్యక్రియలకు వచ్చే వారు కాసేపైన్నా దుఃఖం మరిచిపోయేలా శ్మశాన వాటిక సిద్ధమైంది.



అల్లీపురం శ్మశాన వాటిక ముఖద్వారం



అంత్యక్రియలు వీక్షించే వారి కోసం షెడ్లు, మెట్లు

మోడల్‌గా తీర్చిదిద్దాం..



మంత్రి అజయ్‌కుమార్ చొరవతో మోడల్‌గా ఉండేలా శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాం. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించాం. శ్మశాన వాటికకు రోడ్డు కోసం నిధులు కూడా మంజూరయ్యాయి.

– రావూరి కరుణ సైదబాబు, కార్పొరేటర్, 15వ డివిజన్

బురద, కంపచెట్లు దాటి వెళ్లేవాళ్లం



మా గ్రామంలో గతంలో ఎవరైనా చనిపోతే మోకాలి లోతు బురద, కంపచెట్ల మధ్య నుంచి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించేవాళ్లం. కానీ ఇప్పుడు శ్మశానవాటికను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సీసీ రోడ్లు, శివుడు విగ్రహం, పచ్చని చెట్లతో సేదతీరేలా సిద్ధమైంది.

– సామినేని బాబురావు, అల్లీపురం

వేసవిలో సైతం పచ్చదనం



వేసవిలో చెట్లు ఎండిపోయి పంట పొలాలు బీడుగా కనిపిస్తాయి. కానీ మా గ్రామంలోని శ్మశాన వాటిక మాత్రం పచ్చని మొక్కలతో ఇప్పుడు కూడా కళకళలాడుతోంది. నగరంలో ఎక్కడా లేని విధంగా మా గ్రామ శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకుంది.

– పత్తిపాటి శ్రీను, అల్లీపురం

ఖమ్మం మార్కెట్‌లోకి న్యూ బొలెరో మాక్స్ పికప్



వాహనాన్ని ఆవిష్కరించిన ఆర్‌టీఓ కిషన్‌రావు, తదితరులు

ఖమ్మంఅర్బన్: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా బొలెరో సిరీస్‌లో నూతన మోడల్ న్యూబొలెరో మాక్స్ పిక్ అప్ హెచ్డీ 20 వాహనాన్ని శనివారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని మహీంద్రా షోరూంలో జిల్లా రవాణా శాఖాధికారి తోట కిషన్‌రావు వాహనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వాహనం నడిపే వారు తప్పక సీటు బెల్ట్ ధరించాలని, ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపొద్దని సూచించారు. డ్రైవర్‌పై ఆయన కుటుంబం ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. వీవీసీ గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నూతన బొలెరో వాహనానికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థ ఉండగా, టైర్లు, సామర్థ్యం తదితర అంశాల్లో ప్రత్యేకతలు ఉన్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో వీవీసీ గ్రూప్ సంస్థల చైర్మన్ ద్రౌపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్య, ఆమె ప్రియుడే హంతకులు

- తూటికుంట్ల కేసులో ఆరునెలల తర్వాత వీడిన చిక్కుముడి
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని తూటికుంట్ల గ్రామంలో గత ఏడాది అక్టోబర్ 21న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. ఆరున్నర నెలల తర్వాత కేసు చిక్కుముడి వీడింది. సదరు వ్యక్తి మృతికి ఆయన భార్య, ప్రియుడు విషప్రయోగం చేయడమే కారణమని తేల్చిన పోలీసులు వారిద్దరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. తూటికుంట్లకు చెందిన గుమ్మా నాగరాజు(30) గత ఏడాది అక్టోబర్ 31న మృతి చెందాడు. ఆయన మృతదేహం పక్కన అన్నం పడేసి ఉండడం, మద్యం గ్లాసులో నురగలను గుర్తించిన కుటుంబీకులు అనుమానంతో పోలీసులను ఆశ్రయించారు. నాగరాజు భార్య ప్రవర్తనపై అనుమానాలను వెల్లడించారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నాగరాజు భార్య ఉమాశ్రీ కదలికలు ఆరా తీస్తూ విచారణ చేపట్టగా ఆమెకు రాంబాబుతో వివాహేతర సంబంధం ఉందని తేలింది. వీరిద్దరిని గతంలోనే అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది. అయితే, నాగరాజు శరీర భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించగా నివేదిక శనివారం వచ్చింది. ఆయన శరీర భాగాల్లో విషం ఆనవాళ్లు ఉన్నట్లు తేలగా పోలీసులు ఉమ, రాంబాబును అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడించారు. నాగరాజు భార్య ఉమాశ్రీ,కి రాంబాబు వివాహేతర సంబంధం కొనసాగుతుండగా ఆయనను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం విషాన్ని సిద్ధం చేసుకున్నారు. నాగరాజుకు మద్యం సేవించే అలవాటు ఉండడంతో అక్టోబర్ 31న ఆయన ఇంట్లోనే మద్యం తాగుతున్నాడు. ఇదే అదునుగా ప్రియుడు తెచ్చి ఇచ్చిన విషాన్ని ఉమాశ్రీ ఆహారంతో పాటు మద్యంలో కలపగా ఆయన మృతి చెందాడు. ఆపై ఏమీ తెలియనట్లు వ్యవహరించినా కుటుంబీకుల అనుమానంతో కేసు ఛేదించిన పోలీసులు ఉమాశ్రీ, రాంబాబును హత్య కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మధిర సీఐ మురళి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అశ్వాపురం: మండలంలోని జగ్గారం గ్రామానికి చెందిన ఉడతనేని రజని (35) ఈ నెల 5వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే, తన చావుకు ఆడపడుచు, భర్త, కుటుంబ సభ్యులే కారణమని, తరచూ భూతగాదాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నారని నోట్ రాసింది. బాధితురాలి బంధువు గొర్తి రాజేశ్‌బాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ జితేందర్ శనివారం నలుగురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సోదరిని నిద్రకు తీసుకెళ్లి వస్తుండగా ఘటన

సత్తుపల్లిటౌన్: ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బొర్రా వెంకటేశ్వరరావు(60) సోదరి వంగలి సత్యవతి భర్త చెన్నయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆమెను చాత్రాయి మండలం బూర్గుగూడెంలో నిద్ర చేయించి ఆటోలో సత్తుపల్లికి శనివారం బయలుదేరాడు. పట్టణ శివారు మెట్టాంజనేయస్వామి ఆలయం సమీపాన ఎదురుగా వెళ్తున్న కారు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వెంకటేశ్వరరావు, ఆయన సోదరి సత్యవతి, ఆటోడ్రైవర్ సంభోజు ప్రసాద్, స్నేహితుడు లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వెంకటేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇక లక్ష్మణ్‌కు తీవ్రగాయాలు కావటంతో ఖమ్మం తరలించారు. అలాగే, సత్యవతి, ప్రసాద్ సత్తుపల్లిలోనే చికిత్స పొందుతున్నారు. కాగా, వెంకటేశ్వరరావుకు భార్య లక్ష్మి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వీ.వీ.పాలెం వద్ద వాహనదారుడు...

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం – వైరా ప్రధాన రహదారిలో వి.వెంకటాయపాలెం వద్ద ఉన్న దాబా మీదుగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వీరికి ఎదురుగా రాంగ్‌రూట్‌లో మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఖమ్మం గోపాలపురానికి చెందిన భవాని శివ(18) తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వాహనంపై వెనుక కూర్చున్న తురాయి రవికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే, ప్రమాదానికి కారణమైన వాహనదారుడు పారిపోయాడు. ఈమేరకు రఘునాథపాలెం ఎస్ఐ రవి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

బహిష్కరించే హక్కు ప్రధాన కార్యదర్శికి లేదు

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్

గుండాల: తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ తీర్మానం లేకుండా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఐదుగురు ఆదివాసీ సభ్యులతో తుడుందెబ్బ జాతీయ కమిటీ నిర్మాణమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే చర్చ మూడేళ్లుగా నడుస్తోందని తెలిపారు. ఎన్నికల కు వెళ్లే విధానంలో జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్యను ఒక్కడినే బాధ్యుడిని చేసి ఆరోపణ చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ నెల 21న రాష్ట్ర కమిటీ సమావేశం మేడారం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామని, అక్కడికి వచ్చి ఎవరైనా తమ అభిప్రాయాలు చెప్పవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, ప్రచార కార్యదర్శి బాలకృష్ణతోపాటు పొడుగు రామారావు, దుగ్గారపు వీరభద్రం, పూనెం శ్రీను, సూర్నబాక కిషన్‌రావు, మోకాళ్ల కన్నయ్య, కల్తీ మల్లయ్య, ఈసం సాంబయ్య, గోవింద నర్సింహారావు, చింత వెంకటేశ్వర్లు, మహేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

టైరు పంక్చరై బోల్తాపడిన ట్రాలీ

పాల్వంచరూరల్: ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న ట్రాలీ బోల్తా పడిన ఘటన శనివారం మండలంలోని కేశవాపురం వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచ నుంచి భద్రాచలం వైపు కోడిగుడ్లను తీసుకెళ్తున్న ట్రాలీ వాహనం కేశవపురం వద్దకు చేరుకోగానే ముందు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయలు కాగా కోడిగుడ్లు మొత్తం రోడ్డుపై పడి పగిలిపోయాయి. సుమారు రూ.లక్షకుపైగా నష్టం జరిగి ఉంటుందని సమాచారం.

నేటి నుంచి బెళగావి ఎక్స్‌ప్రెస్..

కొత్తగూడెంఅర్బన్: బెళగావి నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం నుంచి మణుగూరు వరకు పొడిగించారు. మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రజల సౌకర్యం కోసం బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు పొడిగించాలని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మణుగూరు వరకు పొడిగిస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో 7న తెల్లవారుజామున 5.25 గంటలకు బయలుదేరి ఉదయం 10.45 గంటలకు కొత్తగూడెం స్టేషన్‌కు చేరుకుని, అనంతరం మణుగూరుకు వెళ్లనుంది. అక్కడి తిరిగి సాయంత్రం 3.40 గంటలకు బయలుదేరి 4.50 గంటలకు కొత్తగూడెం చేరుకుని, అనంతరం సికింద్రాబాద్ వెళ్లనుంది. పొడిగింపు షెడ్యూల్ 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకే రైల్వే శాఖ విడుదల చేయగా, రైలు రోజూ నడుస్తుందని.. ఆ తర్వాత కూడా అధికారులు కొనసాగించే అవకాశముందని స్టేషన్ అధికారులు చెబుతున్నారు. కాగా ఈ ఏడాది జనవరి నెలలో ఈ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించి రద్దు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం బెళగావి రైలు ఏర్పాటుతో ప్రయాణికులకు ఊరట కలుగనుంది.

క్లుప్తంగా...

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిన పద్మావతి



అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి ఈ నెల 4వ తేదీన ప్రారంభించిన వార్షిక వసంతోత్సవాలు శనివారం రాత్రి మహాపూర్ణాహుతితో ముగిశాయి. వసంతోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారిని వేకువజామునే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనం మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి దివ్యాలంకార శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వార్షిక వసంతోత్సవాలు పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. వసంతోత్సవాలు ముగియడంతో ఆదివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజుకు షోకాజ్ నోటీస్?

- సంబంధం లేని వ్యాఖ్యలు చేసిన ఫలితం!

సాక్షి, విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో విష్ణుకుమార్ రాజు సంబంధం లేని వ్యాఖ్యలు చేసినందుకు ఈ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. పార్టీ వర్గాల కథనం ప్రకారం.. విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ సంఘం ఆయనకు నోటీసు జారీ చేసింది. వ్యాఖ్యలపై ఆదివారం సాయంత్రంలోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే సస్పెన్షన్‌కు గురికావలసి వస్తుందని హెచ్చరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలపై అసత్య ఆరోపణలు, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి పిలవకపోయినా పిలిచినట్లు ప్రస్తావిస్తూ అబద్ధపు మాటలు ఎలా చెబుతారని ఆగ్రహం వ్యక్తంచేసింది. పొత్తులపై స్థాయిని మరిచి మాట్లాడినందుకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గతంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించామని ఆ నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది.

సెలవిక.. శత్రుంజయ!

సేవల నుంచి నిష్క్రమించనున్న 'ఐఎన్‌ఎస్ మగర్' యుద్ధ నౌక

1987 నుంచి 36 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో కీలక పాత్ర

- విశాఖ కేంద్రంగా 29 ఏళ్ల పాటు సేవలందించిన నౌక
- 2004 సునామీ సమయంలో అండమాన్‌లో 1300 మందిని రక్షించిన మగర్
- ఎల్‌టీటీఈ ఆపరేషన్, కోవిడ్ కాలంలో ఆపరేషన్ సేతులో ముఖ్యభూమిక
- నేడు కొచ్చిలో ఐఎన్‌ఎస్ మగర్‌కు ఘన వీడ్కోలు పలకనున్న భారత నౌకాదళం



ఐఎన్‌ఎస్ మగర్ యుద్ధ నౌక

సాక్షి, విశాఖపట్నం: నీటిలోనే కాదు.. నేలపైనా దాడిచేసే స్వభావం ఉన్న మొసలి (మగర్) లక్షణాల్ని పుణికిపుచ్చుకున్న ఆ యుద్ధ నౌక వస్తుందంటే శత్రువుల వెన్నులో వణుకు పుట్టేది. ఆయుధ సంపత్తిని మోసుకొస్తున్న ఆ నౌక కనిపిస్తే చాలు.. శత్రు సైన్యంతో పోరాడుతున్న బలగాలకు కొండంత ధైర్యం పోగవుతుంది. ఆపదలో ఉన్నవారికి ఆత్మీయత పంచుతూ.. విపత్తులో ఉన్నవారిని ఒడ్డుకు చేర్చుతూ.. 36 ఏళ్లపాటు భారత నౌకాదళానికి సుదీర్ఘ సేవలందించిన ఐఎన్‌ఎస్ మగర్ ఆదివారంతో విధులకు స్వస్తి పలకనుంది. వార్‌ఫేర్ వెసెల్‌గా అంతర్జాతీయ విన్యాసాల్లో సత్తా చాటిన మగర్‌కు భారత నౌకాదళం ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతోంది.

ఒడ్డుకు వచ్చి మరీ..

భారత నౌకాదళ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ఉభయచర యుద్ధ నౌకల్లో కీలకమైనదిగా ఐఎన్‌ఎస్ మగర్ ఖ్యాతి ఆర్జించింది. విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డు సహకారంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ)లో మగర్‌ని యాంఫిబియాస్ షిప్‌గా తీర్చిదిద్దారు. అంటే.. సాధారణంగా షిప్‌లు ఒడ్డు వరకూ రాలేవు. కానీ.. మగర్ మాత్రం ఒడ్డు వరకూ వచ్చి.. సైన్యానికి అవసరమైన ఆయుధ సంపత్తిని అందించగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. అందుకే.. దీనికి మగర్ (తెలుగులో మొసలి అని అర్థం) అనే పేరుపెట్టారు. 1987 జూలై 15న భారత నౌకాదళంలో ఈ షిప్ ప్రవేశించింది.

విశాఖ నుంచి సుదీర్ఘ సేవలు

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నానికి ఐఎన్‌ఎస్ మగర్‌ని కేటాయించారు. ల్యాండింగ్ షిప్ ట్యాంక్(ఎల్‌ఎస్‌టీ) హోదాలో యుద్ధ ట్యాంకులు, ఆయుధాలు తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. నలుగురు ల్యాండింగ్ క్రాఫ్ట్ వెహికల్ సిబ్బంది, అత్యవసర సమయంలో దళాల్ని మోహరించేందుకు మగర్ యుద్ధ నౌకను వినియోగించేవారు. శ్రీలంకలో ఎల్‌టీటీఈని నిరోధించే సమయంలో నిర్వహించిన ఆపరేషన్ పవన్‌లో మగర్ కీలక పాత్ర పోషించింది. నిరంతర పోరాటం చేసిన ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్(ఐపీసీకే)కు అవసరమైన సామగ్రిని అందించింది. వివిధ దేశాల్లో జరిగిన ద్వైపాక్షిక విన్యాసాల్లో మగర్ సత్తా చాటింది. 2006 ఫిబ్రవరి 22న విశాఖ తీరానికి 70 కి.మీ. దూరంలో మగర్ యుద్ధ నౌకలో ఘోర ప్రమాదం సంభవించింది. షిప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ముగ్గురు నావికులు మృతి చెందారు. మరో 19 మంది గాయాల పాలయ్యారు. 2018వ సంవత్సరం వరకూ విశాఖ కేంద్రంగా సేవలందించిన మగర్‌ను 2018 ఏప్రిల్‌లో కొచ్చికి తరలించి.. మార్పులు చేర్పుల అనంతరం మొదటి స్క్వాడ్రన్ శిక్షణ నౌకగా సేవలు అందించింది.

సునామీలో విశిష్ట సేవలు

మగర్ అందించిన సేవల్లో ముఖ్యంగా 2004లో వచ్చిన సునామీ సమయమనే చెప్పుకోవాలి. ఎప్పుడు మళ్లీ సముద్రం ఉప్పొంగి.. విలయం వస్తుందో తెలీని సమయంలో ధైర్యంగా సాగర జలాల్లో ప్రయాణించిన మగర్.. అండమాన్ నికోబార్ దీవుల్లో చిక్కుకున్న 1,300 మందిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చింది. అంతేకాకుండా.. అక్కడి నుంచి వివిధ విపత్తు ప్రాంతాలకు తరలివెళ్లి నిరాశ్రయులుగా మిగిలిన వారికి సహాయక సామగ్రి అందజేయడంలోనూ కీలకంగా వ్యవహరించిన మగర్‌కు భారత రక్షణ దళం నుంచి అద్భుత ప్రశంసలందాయి. కోవిడ్ సమయంలో నిర్వహించిన ఆపరేషన్ సముద్ర సేతులోనూ మగర్ విశిష్ట పాత్ర పోషించింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల్ని స్వదేశానికి తీసుకురావడం, స్నేహపూర్వక దేశాలకు వైద్యసామగ్రి అందించడం మగర్ ద్వారానే సాధ్యమైంది.

మగర్ సామర్థ్యమిదీ..

నౌకాదళంలో సేవలు ప్రారంభం: 15 జూలై, 1987
పొడవు: 390 అడుగులు
వెడల్పు: 57 అడుగులు
డ్రాఫ్ట్: 13 అడుగులు
వేగం: గంటకు 28 కి.మీ.
ప్రయాణ సామర్థ్యం: ఏకధాటిగా 3 వేల మైళ్ల ప్రయాణం
ఆయుధ సామర్థ్యం: బీఈఎల్–1245 రాడార్ నావిగేటర్, నాలుగు బోఫోర్స్ 40 ఎంఎం గన్స్, 2 మల్టిపుల్ బ్యారెల్ రాకెట్ లాంచర్స్, ఒక సీ కింగ్ హెలికాప్టర్
వార్ ఫేర్ యూనిట్: 15 యుద్ధ ట్యాంకులు, 13 బీఎంపీ పదాతిదళ పోరాట వాహనాలు, 10 ట్రక్కులు, 8 భారీ మోటార్ వెహికల్స్‌తోపాటు 500 మంది సైనికుల్ని ఒకేసారి తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం.

నేడు కొచ్చిలో నిష్క్రమణం

నౌకాదళానికి 36 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన మగర్ యుద్ధ నౌకకు కొచ్చి పోర్టులో భారత నౌకాదళం ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే డీకమిషన్ కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ మగర్‌లో సేవలందించిన కెప్టెన్‌లు, అధికారులకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'అవర్ బోల్డ్ అండ్ బ్రేవ్ మగర్' పేరుతో షార్ట్ ఫిల్మ్‌ని ప్రదర్శించి యుద్ధ నౌకకు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.

టెన్త్ ఫలితాల్లో.. తిరుగులేని 'మన్యం'

- ఏపీలో మొత్తం 72.26 శాతం ఉత్తీర్ణత
- 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా టాప్..
- 60.39 శాతంతో చివరి స్థానంలో నంద్యాల



పదో తరగతి ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అధికారులు

సాక్షి, అమరావతి: టెన్త్ ఫలితాల్లో ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా తిరుగులేని ఫలితాలు సాధించింది. 87.47 శాతం ఉత్తీర్ణతతో ఈ జిల్లా ఏపీలోనే అగ్రస్థానంలో నిలిచింది. 60.39 శాతం ఫలితాలతో నంద్యాల జిల్లా చివరి స్థానం దక్కించుకుంది. అలాగే, ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది 6,05,052 మంది పరీక్షలకు హాజరుకాగా.. 4,37,196 మంది అంటే 72.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికల ఉత్తీర్ణత శాతం 75.38 శాతమైతే బాలురది 69.27 శాతం. 933 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, 38 పాఠశాలల్లో 'జీరో' ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలను విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం విజయవాడలోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో 67.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఐదు శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.25 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. ఇంగ్లిష్ మీడియంలో సైతం 80.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమని ఆయన తెలిపారు.

ఆ ఆరుగురూ పాస్..

దృష్టిలోపం విద్యార్థుల కోసం డిజిటల్ విధానంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు హాజరైన ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. ఈ తరహాలో పరీక్షలు నిర్వహించడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. అనంతపురం జిల్లా పొలిమెర చైత్రిక, చెంచుగారి పావని, యక్కలూరి దివ్యశ్రీ, మేకా శ్రీధాత్రి, యేకుల సౌమ్య, ఉప్పర నాగరత్నమ్మల కోసం డిజిటల్ రూపంలో ఈ పరీక్షలు న్విహించారు.

2 నెలల్లో 2 వేల ఐటీ ఉద్యోగాలు

నైపుణ్యం కలిగిన మానవ వనరుల అన్వేషణలో విశాఖ ఐటీ కంపెనీలు

సాక్షి, అమరావతి: ఐటీ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖపట్నానికి విస్తరిస్తుండటంతో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న ఇన్ఫోసిస్‌తో పాటు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, రాండ్‌శాండ్, టెక్నోటాస్క్, భారీగా విస్తరిస్తున్న టెక్ మహీంద్రా, డబ్ల్యూఎన్‌ఎస్ వంటి కంపెనీలు పెద్ద ఎత్తున నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఎదురుచూస్తున్నాయి. విశాఖలో ఉన్న ఐటీ కంపెనీలకు వచ్చే రెండు నెలల్లోకనీసం రెండు వేల మంది ఐటీ నిపుణులు అవసరమవుతారని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) అంచనా వేసింది. విశాఖలోని ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ద్వారా శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తికాగానే ఉపాధి కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ 'సాక్షి'కి తెలిపారు. ఇందు కోసం రెండు నెలల్లో కనీసం రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

గుండ్ల కోనలో అరుదైన శాసనం



గుండ్లకోనలో వెలుగు చూసిన శాసనం

కడప కోటిరెడ్డిసర్కిల్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని శేషాచలం అడవి పరిధిలో ఉన్న గుండ్ల కోనలో అరుదైన శాసనం వెలుగుచూసింది. తిరుపతికి చెందిన చారిత్రక పరిశోధకులు భూమన సుబ్రహ్మణ్యం దీనిని గుర్తించి భారత పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి వివరాలు వెల్లడించారు. ఇది తాళ్లపాక పెద తిరుమలయ్య వేయించిన శాసనమని తెలిపారు. పూర్వం శ్రీతిరుమలేశుడు అయిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కొన్ని ప్రాంతాల వారు రాజంపేట (తాళ్లపాక) ద్వారా కాలికడకన తిరుమలకు వెళ్లే సంప్రదాయం ఉండేదన్నారు. ఈ శాసనం ఓ రాతిపై చెక్కబడి ఉందని.. 1537 జూన్, 15న శుక్రవారం తాళ్లపాక అన్నమయ్య కుమారుడు తాళ్లపాక పెద్ద తిరుమలయ్య ద్వారా హనుమంతుని ప్రతిమను ప్రతిష్ఠించిన సందర్భంగా ఈ శాసనాన్ని వేయించినట్లు వివరించారు.

జిల్లా వార్తలు

ప్లాంటేషన్ అక్రమాలపై స్పెషల్ స్క్వాడ్ విచారణ



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం కొమరారం రేంజ్ మాణిక్యారం సెక్షన్ పరిధిలో 2019 నుంచి జరిగిన ప్లాంటేషన్ పనులపై స్పెషల్ స్క్వాడ్ శనివారం విచారణ చేపట్టింది. మొక్కలు నాటేందుకు ఎంపిక చేసిన అటవీ భూమి విస్తీర్ణాన్ని ఎక్కువగా నమోదు చేసి నిధులు డ్రా చేసినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవంగా మొక్కలు నాటిన విస్తీర్ణం, రికార్డుల్లో చూపిన విస్తీర్ణం వివరాలు ఆరా తీశాయి. కాగా, ఈ అక్రమాల వ్యవహారంలో ఇప్పటికే ఇల్లెందు, కొమరారం రేంజ్ పరిధిలో పలువురు అటవీశాఖ అధికారులు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. తాజా విచారణతో ఇంకా ఎవరిపై వేటు పడుతుందోనని శాఖలో చర్చ జరుగుతోంది. తనిఖీల్లో స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాగభూషణం, ఎఫ్‌ఆర్‌ఓ సందీప్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దకోరుకొండి వాసికి అమెరికాలో డాక్టరేట్



యూనివర్సిటీ వద్ద తల్లిదండ్రులతో హర్ష

కల్లూరురూరల్: కల్లూరు మండలం పెద్దకోరుకొండికి చెందిన మాదిరాజు హర్ష అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టొలెంటో బహామో యూనివర్సిటీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ సాధించాడు. ఈ సందర్భంగా హర్ష, ఆయన తండ్రి మాజీ మార్కెట్ డైరెక్టర్ అన్నంరాజును ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డాక్టర్ వేము గంగరాజు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఫోన్‌లో అభినందించారు. అలాగే, ఎంపీపీ వీరపెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ రత్తమ్మ తదితరులు కూడా హర్షకు శుభాకాంక్షలు తెలిపారు.

అమ్ముకోవాలంటే ఆంధ్రాకు వెళ్లాల్సిందే..

- భద్రాద్రి జిల్లాలో పొగాకు సాగు చేస్తున్న రైతుల ఇక్కట్లు
- స్థానికంగా వేలం కేంద్రం లేకపోవడంతో సమస్య
- వనరులు ఉన్నా ఎవరూ పట్టించుకోని వైనం



జంగారెడ్డిగూడెంలోని పొగాకు వేలం కేంద్రంలో రైతులు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: వర్జీనియా సాగుకు కేరాఫ్‌గా నిలుస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల రైతులు పంట అమ్ముకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని ఈ రెండు మండలాల్లో వర్జీనియా పొగాకు దాదాపు ఆరు వేల నుంచి ఏడు వేలకుపైగా ఎకరాల్లో సాగవుతోంది. ఈ రెండు మండలాల్లో 730 పొగాకు బ్యారళ్లు ఉండగా, వర్జీనియా సాగుపై 1,200 మంది రైతులు, కూలీలు, కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. దశాబ్దాలుగా నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో వర్జీనియా టుబాకో వేలం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉండగా.. ప్రతిపాదనల దశ దాటడం లేదు. ఏటా పంట సాగు సమయంలో ఈ విషయం తెరపైకి రావడం.. ఆపై పక్కన పెట్టడం ఆనవాయితీగా మారింది. దీంతో అష్టకష్టాలు పడుతూ ఏపీలోని జంగారెడ్డిగూడెం వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జంగారెడ్డిగూడెం కేంద్రమే దిక్కు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దశాబ్దాల కాలం కిందట ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో పొగాకు వేలానికి రెండు కేంద్రాలను ఏర్పాటుచేశారు. అప్పట్లో ఆయా కేంద్రాల పరిధిలోకి అశ్వారావుపేట, దమ్మపేట మండలాలను చేర్చారు. దీంతో అప్పటి నుంచి రైతులు జంగారెడ్డిగూడెం వెళ్లి పంట అమ్ముకోవాల్సి వస్తోంది. పొగాకు కేంద్రాలు అశ్వారావుపేటకు 28 కి.మీ. దూరంలో, దమ్మపేట మండలానికి సుమారు 42 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఏటా వర్జీనియా పొగాకు పంటను రైతులు ఆగస్టు నుంచి నవంబర్ వరకు సాగు చేస్తారు. ఆ తర్వాత డిసెంబర్ నుంచి మే వరకు వేలం సాగుతుంది. ఈ సమయంలో రైతులు పొగాకును గ్రేడింగ్ చేసి బ్యారెళ్లుగా వాహనాల్లో జంగారెడ్డిగూడెం తీసుకెళ్తారు.



రైతులు సాగు చేస్తున్న పొగాకు తోట

అయినా సరే వెళ్దామంటే..

దూరమైనా, భారమైనా జంగారెడ్డిగూడెం వెళ్తున్న రైతులకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. అక్కడకు పొగాకు తరలించే క్రమంలో అకాల వర్షానికి బ్యారళ్లు తడిసి అనేక మార్లు నష్టపోయారు. అలాగే, కేంద్రానికి తీసుకెళ్లాక ధర అనుకూలంగా లేకపోతే తిరిగి తీసుకురావడం, గిట్టుబాటు వస్తుందనుకున్నప్పుడు మళ్లీ వెళ్లడంతో వ్యయప్రయాసాలకు లోనవుతుండగా.. కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వనరులు ఉన్నా...

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత పొగాకు వేలం కేంద్రాలు ఏపీ పరిధిలోకి వెళ్లాయి. దీంతో తెలంగాణలో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాలు లేకుండా పోగా.. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల రైతాంగం ఏపీలోని కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ పేరాయిగూడెం, అల్లిగూడెం, పాత అల్లిగూడెం, నారంవారిగూడెం కాలనీ గ్రామాల్లో ప్రభుత్వ భూములు అనేకం ఉన్నందున కేంద్రం ఏర్పాటుకు స్థలసేకరణ కూడా సమస్య కాబోదని చెబుతున్నారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకుచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

బోర్డు దృష్టి సారించడం లేదు..



అశ్వారావుపేటలో పొగాకు వేలం కేంద్రం ఏర్పాటు అంశాన్ని పక్కనపెట్టారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాల నిర్వహణ భారంగా మారిన నేపథ్యాన కొత్త కేంద్రాల ఏర్పాటుపై టుబాకో బోర్డు దృష్టి సారించడం లేదు. పొగాకు వేలం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 7 మిలియన్ల పొగాకు ఉత్పత్తి కావాల్సి ఉంటుంది. అందులో సగం కూడా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో జరగడం లేదు.

–కొడవాటి వాసుదేవరరావు, మాజీ వైస్ చైర్మన్, టుబాకో బోర్డు, గుంటూరు

కార్పొరేట్ వేతన అకౌంట్లపై జీఎం సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని సీఎంపీఎఫ్, సీపీఆర్‌ఎంఎస్ కార్పొరేట్ సాలరీ అకౌంట్‌పై శనివారం జీఎం (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కె.బసవయ్య సమీక్షించారు. ఏరియాలోని పర్సనల్ విభాగం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ సీఎంపీఎఫ్ వివరాల డిజిటలైజేషన్ కోసం కంపెనీవ్యాప్తంగా 42 వేల మంది కార్మికుల డివిడెండ్ నామినేషన్, ఆధార్, పాన్, సెల్ నంబర్ సేకరించాలని, ఆపై రివైజ్డ్ నామినేషన్ పత్రాలకు అధికారుల నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీపీఆర్‌ఎంఎస్–ఎన్‌ఈ స్కీంలో సభ్యత్వం పొందిన పదో వేజ్‌బోర్డ్ విశ్రాంత కార్మికుల వివరాలు కూడా సింగరేణి సైట్‌లో పొందుపర్చడం, ఇతర ప్రక్రియలను ఈ నెల 8వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీజీఎం (పర్సనల్) కోడూరి శ్రీనివాసరావుతో పాటు జీవీ కిరణ్‌కుమార్, ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆశ్రమ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల రద్దు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 89 మంది ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను శనివారం డీడీ రమాదేవి రద్దు చేశారు. మొత్తం 180 మంది ఉపాధ్యాయులు ఆశ్రమపాఠశాలల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్దిరోజుల కిందట 39మంది ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయగా శనివారం మరో 89 మంది వి కూడా రద్దుచేశారు. మిగతా వారి అర్హతలు కూడా పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం..

ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం భవానీప్రసాద్



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్‌ఎం భవానీప్రసాద్

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చటమే లక్ష్యంగా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ ఖమ్మం డిప్యూటీ ఆర్‌ఎం ఎస్.భవానీప్రసాద్ అన్నారు. రీజినల్ స్థాయిలోని ఆరు డిపోల సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ల(ఎస్‌డీఐ) సమావేశంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రమాదరహితంగా బస్సులు నడిపేలా డ్రైవర్లకు ఎస్‌డీఐలు సూచనలు చేయాలని తెలిపారు. రీజియన్‌ను ప్రమాదరహితంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని, బస్సులు మార్గమధ్యలో ఆగకుండా కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, బీఎస్ 6 బస్సులను డ్రైవర్లు సాఫీగా నడిపేలా సాంకేతికంగా సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, రీజియన్ ఎంఎఫ్ శ్రావణ్‌కుమార్, ఎస్‌డీఐలు పాల్గొన్నారు.

కోరం కనకయ్య మాజీ అనుచరుల భేటీ

గార్లలో సమావేశమై రాజకీయ భవిష్యత్‌పై చర్చ

గార్ల: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ముఖ్య అనుచరులుగా కొనసాగిన నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం, టేకులపల్లి, కామేపల్లి, ఇల్లెందు మండలాల నేతలు శనివారం మహబూబాబాద్ గార్లలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రాజకీయ భవిష్యత్‌పై సమాలోచనలు జరిపినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగాలా, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో నడవాలా అని వారి భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రస్తుత ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియతో గార్ల, బయ్యారం, టేకులపల్లి పీఏసీఎస్‌ల చైర్మన్లు వడ్లమూడి దుర్గాప్రసాద్, మూల మధుకర్‌రెడ్డి, లక్కినేని సురేందర్, ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, కామేపల్లి మాజీ జెడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్‌కు సఖ్యత లేకపోవడంతో దూరంగా ఉంటున్నారు. వీరిలో గార్ల, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్లు మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి నడుస్తుండగా, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరారు. ఇక మల్లిబాబు పొంగులేటి వర్గంలో కొనసాగుతుండగా, మడత వెంకట్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన వీరు సమావేశమై చర్చలు జరపడం గమనార్హం.

క్రీడలతో శారీరక దృఢత్వం

- సకల సౌకర్యాలతో సర్దార్ పటేల్ స్టేడియం
- టెన్నిస్ కోర్టులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



టెన్నిస్ కోర్టులను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కోసం క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన మూడు టెన్నిస్ కోర్టులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఖమ్మంలోనే అత్యాధునిక క్రీడాసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. జాతీయస్థాయి పోటీల నిర్వహణ కోసం రూ.93 లక్షల వ్యయంతో టెన్నిస్‌కోర్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ ఆస్ట్రేలియా తరహాలో ఆధునిక విధానంలో టెన్నిస్ కోర్టులు ఖమ్మంలో అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం సీపీ వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడారు. ఆ తర్వాత మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ కాసేపు టెన్నిస్ ఆడాక జాతీయస్థాయి సెయిలింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన పిల్లి అఖిల్‌ను సన్మానించారు. సుడా చైర్మన్ విజయ్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కార్పొరేటర్లు పగడాల నాగరాజు, నారాయణ, టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు మద్దినేని వెంకట్, శ్రీనివాస్, సత్యానారాయణ, ఎండీ గౌస్, ఎండీ అక్బర్‌అలీ పాల్గొన్నారు.



టెన్నిస్ ఆడుతున్న మంత్రి